# మాకు న్యాయం ఎప్పుడు చేస్తరు?

## ఇచ్చిన మాట ఎప్పుడు నిలుపుకుంటరు?

భారత్ జోడో యాత్ర, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేరుస్తరు?

- రైతు భరోసా, బోనస్ ఏమైంది?
- రేవంత్, రాహుల్‌కు కౌలు రైతుల సూటి ప్రశ్న
- ఈ వానకాలం నుంచి కౌలుదారు చట్టం-2011 అమలు చేయాలని డిమాండ్

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ): 'మాకు న్యాయం ఎప్పుడు చేస్తరో, మాకు ఇచ్చిన మాట ఎప్పుడు నిలుపుకొంటారో చెప్పండి' అంటూ కౌలు రైతులు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సూటిగా ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ సర్కార్ వస్తే తమకు లాభం జరుగుతుందని భావించామని, కానీ అన్యాయమే జరుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న కౌలు రైతులు అనంతరం మీడియాతో మాట్లాడారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలం తొండపల్లి గ్రామానికి చెందిన కురువ మంజుల మాట్లాడుతూ.. '2022లో భారత్ జోడో యాత్ర జరిగినప్పుడు స్వయంగా రాహుల్‌గాంధీని కలిసి నా బాధ చెప్పుకున్నాను. కౌలు రైతులకు తప్పక సహాయం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. నేను ఇప్పటికీ కౌలుకు భూమి పట్టుకొని వ్యవసాయం చేస్తున్నా. కానీ మాకు రైతుభరోసా కానీ, పంట రుణాలు కానీ, ఎటువంటి పథకాలు కానీ రావడం లేదు. మాకు న్యాయం ఎప్పుడు చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, రాహుల్‌గాంధీని మళ్లీ అడుగుతున్నా' అని నిలదీశారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధులు

### కౌలు రైతులకు రేవంత్‌రెడ్డి రాసిన లేఖ బహిర్గతం

ఈ సమావేశంలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి కౌలు రైతులు పాల్గొని తమ డిమాండ్లను వినిపించారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం తక్షణమే 2025 వానకాలం నుంచి కౌలు రైతుల గుర్తింపు కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూ అధీకృత సాగుదారుల చట్టం-2011ను అమలుచేసి, కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ సందర్భంగా 2023 సెప్టెంబర్ 13న అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ కౌలు రైతులకు రాసిన బహిరంగ లేఖ కాపీలను రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధులు మీడియాకు అందజేశారు. ఆ లేఖలో కౌలు రైతులకు కాంగ్రెసు ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుందని, భూ అధీకృత సాగుదారుల చట్టం-2011ను అమలు చేసి కౌలు రైతులకు గుర్తింపుకార్డులు మళ్లీ ఇస్తామని, రైతు భరోసాతోబాటు ఇతర పథకాలు, పంట రుణాలను కూడా అందిస్తామంటూ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్‌తోపాటు ఆరు గ్యారెంటీల్లోనూ కౌలు రైతులకు కూడా పథకాలు అందిస్తామని స్పష్టంగా పేర్కొన్నదని, ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తంచేశారు. సమావేశంలో కౌలు రైతులు కురువ మంజుల, రమాకాంత్, మాదాసు మాధవి, చాపల సుజాత, ఎడ్ల మానస, ముదస్తు సుమలత, శ్రీనివాస్, రాందాస్, రమేశ్, రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధులు బీ కొండల్, కన్నెగంటి రవి, విస్సా కిరణ్‌కుమార్, ఎస్ ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

### కౌలు రైతుల డిమాండ్లు

- వెంటనే భూ అధీకృత సాగుదారుల చట్టం-2011ను అమలుచేయాలి.
- కౌలు సాగుదారుల నుంచి దరఖాస్తులు తీసుకొని వారికి ఎల్ఈసీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి.
- గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు పంట బీమా, పంట నష్ట పరిహారం, రైతు బీమా, పంట అమ్మకం, బ్యాంకు రుణాలు అమలుచేయాలి.
- రైతు భరోసా అనేది పెట్టుబడి సహాయం కాబట్టి కౌలు రైతులకు కూడా అందించాలి.

# ముగ్గురు రైతుల ఆత్మహత్య

- భారంగా మారిన పెట్టుబడి అప్పులు
- వాటిని తీర్చేమార్గం లేక తీవ్రమనస్తాపం
- మానుకోట, జనగామ, నిర్మల్ జిల్లాల్లో విషాదం


బానోత్ హచ్యా, కాలువ రాజు, జాదవ్ వినోద్(ఫైల్)

గూడూరు/జఫర్‌గఢ్/భైంసా టౌన్, మే 12: దిగుబడులు రాక.. సాగు కోసం చేసిన అప్పులు తీర్చేమార్గం లేక ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మహబూబాబాద్, జనగామ, నిర్మల్ జిల్లాల్లో ఒక్కొక్కరు బలవన్మరణానికి పాల్పడ్డారు. వివరాలిలా.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం పొనుగోడులో గిరిజన రైతు బానోత్ హచ్యా(50) తన రెండెకరాల పొలంతోపాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకొని వరి సాగుచేశాడు. దిగుబడి సరిగా రాకపోవడం, అప్పటికే ముగ్గురు కుమార్తెల వివాహానికి చేసిన అప్పులతోపాటు పంట పెట్టుబడికి మరిన్ని అప్పులు చేశాడు. సుమారు రూ.5 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపంతో ఆదివారం ఇంటి నుంచి బయటికి వెళ్లిన హచ్యా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం ఉదయం వ్యవసాయ పనుల కోసం వెళ్లిన గ్రామస్థులకు బావిలో హచ్యా మృతదేహం కనిపించింది. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని బావిలోంచి బయటికి తీశారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. జనగామ జిల్లా జఫర్‌గఢ్‌కు చెందిన రైతు కాల్వ రాజు(40) తనకున్న మూడెకరాల్లో సాగు కోసం జఫర్‌గఢ్‌లోని టీజీ బ్యాంక్‌లో రూ.1.30 లక్షలు అప్పు తీసుకున్నాడు. అవి సరిపోకపోవడంతో భార్య అనూషకు చెందిన బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి అప్పు తెచ్చాడు. ఈ క్రమంలో పంట సరిగా పండక, బ్యాంక్ అప్పులు తీర్చలేక మనోవేదనకు గురయ్యాడు. రూ.3 లక్షల అప్పు తీర్చే మార్గం లేక ఆదివారం సాయంత్రం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు.

### 15 లక్షల అప్పు తీర్చలేక..

నిర్మల్ జిల్లా భైంసా మండలం వాటోలి గ్రామానికి చెందిన రైతు జాదవ్ వినోద్ (39) తనకున్న ఏడెకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. సరైన దిగుబడి రాకపోవడంతో పెట్టుబడి కోసం తెచ్చినవి, వైద్య చికిత్స కోసం సుమారు రూ.15 లక్షల అప్పులయ్యాయి. ఇవి ఎలా తీర్చాలో తెలియక తీవ్రమనస్తాపంతో ఆదివారం రాత్రి దూలానికి చీరతో ఉరేసుకున్నాడు. సోమవారం ఉదయం అతని భార్య గదిలోకి వెళ్లగా విగత జీవిగా కనిపించాడు. భార్య లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై శంకర్ తెలిపారు.

# వడ్ల కుప్పపైనే రాలిన రైతన్న

- పోచంపల్లి కొనుగోలు కేంద్రంలో వడ్లు తూర్పార పడుతూ అస్వస్థత
- వడదెబ్బకు గురై గిరిజన రైతు గుగులోతు కిషన్ మృతి
- బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని పలు సంఘాల డిమాండ్
- ముఖ్యమంత్రికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ అన్నదాతలపై లేదు
- ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే: ఎక్స్ వేదికగా కేటీఆర్ పోస్ట్


మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం పోచంపల్లి ఐకేపీ సెంటర్‌లో వడదెబ్బ తగిలి విగతజీవిగా పడి ఉన్న రైతు కిషన్

పెద్దవంగర/హైదరాబాద్ , మే 12 (నమస్తే తెలంగాణ): తాను పండించిన ధాన్యం కుప్పపైనే పడి గిరిజన రైతు మృతి చెందిన ఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం పోచంపల్లిలో చోటుచేసుకున్నది. స్థానిక ఐకేపీ కొనుగోలు కేంద్రంలో వడ్లను తూర్పారపడుతున్న క్రమంలో వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయాడు. వివరాలు ఇలా.. మండలంలోని గంట్లకుంట గ్రామ పరిధిలోని రామోజీ తండాకు చెందిన గుగులోత్ కిషన్ (52) తన కున్న రెండు ఎకరాల్లో సాగు చేశాడు. ధాన్యాన్ని అమ్మేందుకు పక్క గ్రామం పోచంపల్లిలోని ఐకేపీ కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాడు. రోజులు గడుస్తున్నా, తేమశాతం వచ్చినా నిర్వాహకులు కాంటా వేయకపోవడంతో కొనుగోలు కేంద్రంలోనే పడిగాపులు కాస్తున్నాడు. సోమవారం వడ్లను తూర్పార పడుతున్న క్రమంలో ఎండ తీవ్రతకు వడదెబ్బతో అస్వస్థతకు గురై అక్కడికక్కడే కుప్పకూలాడు. ప్రభుత్వం వెంటనే రైతు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కిషన్ రెండు రోజులుగా మందులు వాడకపోడంతో బీపీ పెరిగి చనిపోయినట్టు డీఆర్‌డీవో మధుసూదన్‌రాజ్ తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

### ఇటీవలికాలంలో ముగ్గురు మృతి

కొనుగోలు కేంద్రాల్లో సరైన మౌలిక సౌకర్యాలైన తాగునీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ కిట్ లేకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు సైతం కేంద్రాల్లో మొక్కుబడి తనిఖీలు చేయడం తప్ప సదుపాయాల గురించి పట్టించుకోవడం లేదు. ఫలితంగా మహబూబాబాద్ జిల్లాలో ఇటీవలి కాలంలో ముగ్గురు రైతులు కొనుగోలు కేంద్రాల్లో మరణించారు. ఏప్రిల్ నెల 22న నెల్లికుదురు మండలం మదనతుర్తిలో రైతు బిర్రు వెంకన్న, ఏప్రిల్ 21న తొర్రూరు మండలం చెర్లపాలెంలో మహిళా రైతు ప్రేమలత, 29న గోపాలగిరిలో రైతు యన్నమాల సారయ్య మృతిచెందారు.

### అన్నదాత మృతి సర్కార్ చేసిన హత్యే

'రైతు కిషన్ వడదెబ్బతో ధాన్యం కుప్పపై ప్రాణాలు వదలడం బాధాకరం. వడ్ల కొనుగోళ్లపై సర్కారు చేస్తున్న జాప్యానికి అన్నదాత మరణమే నిదర్శనం' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఇది ముమ్మాటికీ రేవంత్ సర్కార్ చేసిన హత్యేనని సోమవారం ఎక్స్ వేదికగా తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఓ వైపు ముఖ్యమంత్రి అందాల పోటీల్లో మునిగితేలుతుంటే.. మరో వైపు వడదెబ్బకు తాళలేక ఓ రైతు ధాన్యం కుప్పలపై ప్రాణాలు విడిచే పరిస్థితి నెలకొనడం దురదృష్టకరమని పేర్కొన్నారు. పెట్టుబడి సాయం ఎగ్గొట్టడం, రుణమాఫీ పేరిట మోసం చేయడం, చివరికి పండిన పంటను కొనకుండా గాలికొదిలేయడంతో రైతులు అనాథల్లా మారారని పేర్కొన్నారు. ఓ వైపు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం అకాల వర్షాలతో కండ్లముందే నాశనమవుతుంటే, మరోవైపు మండుతున్న ఎండలను తట్టుకోలేక అన్నదాతలు బలవుతుండటం దురదృష్టకరమని అన్నారు. రైతుల మరణాలకు పూర్తి బాధ్యత దద్దమ్మ కాంగ్రెస్ సర్కార్‌దేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. ధాన్యం కొనకపోవడంతో రైతులు వారాల తరబడి కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. అన్నదాతల దీనస్థితిని చూస్తుంటే అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నదా? అనే అనుమానం కలుగుతుందని అన్నారు. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యానికి బలైన గుగులోతు కిషన్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సీఎం సోయి తెచ్చుకొని కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన వడ్లను కొనుగోలు చేయాలన్నారు. లేదంటే రైతుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

## మద్దతు ధర పంటలన్నీ కేంద్రమే కొనాలి

- ఎరువులు, విత్తనాల కొరత తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలి
- వానకాలం సీజన్ సన్నద్ధతపై మంత్రి తుమ్మల సమీక్ష

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ) : మద్దతు ధర ప్రకటించే ప్రతి పంటనూ కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి కేంద్రానికి లేఖ రాస్తామని స్పష్టంచేశారు. వానకాలం సీజన్ సన్నద్ధతపై సోమవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనేక పంటలకు మద్దతు ధర ప్రకటించి.. ఏదో ఒకటి, రెండు పంటలు కొనుగోలు చేసి మిగతా పంటల కొనుగోళ్ల బాధ్యతను రాష్ట్రాలపై వదిలేయడం కరెక్ట్ కాదన్నారు. దీంతో తెలంగాణ వంటి రాష్ట్రాలపై ఆర్థికభారం పడుతుందని చెప్పారు. వానకాలం సీజన్‌కు సంబంధించి యూరియా, విత్తనాల సరఫరాలో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సీజన్‌కు ఇప్పటికే 3.31 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను సిద్ధంగా ఉంచినట్టు, ఈ నెలాఖరుకు మరో 5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా తెప్పించి అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.

## మిల్లుకు బస్తాలు తరలిస్తలేరని రైతు ఆత్మహత్యాయత్నం

- కిరోసిన్ పోసుకుంటుండగా అడ్డుకున్న స్థానికులు
- మహబూబాబాద్ జిల్లా కుమ్మరికుంట్లలో ఘటన


రైతు యాకూబ్

దంతాలపల్లి, మే 12 : కాంటాలు పెట్టిన బస్తాలను మిల్లుకు తరలించడం లేదంటూ ఓ రైతు ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో సోమవారం చోటుచేసుకున్నది. మండలంలోని కుమ్మరికుంట్లకు చెందిన ఎండీ యాకూబ్ 38 రోజుల క్రితం వరి కోసి గ్రామంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు పోశాడు. పూర్తి స్థాయిలో ఆరబెట్టిన తరువాత తేమశాతం వచ్చినా తన వడ్లు కాంటాలు పెట్టకుండా పలుకుబడి ఉన్నవారివి ముందు కాంటాలు పెట్టారని గతంలో కూడా నిర్వాహకులతో గొడవపడ్డాడు. ఆ తర్వాత 354 బస్తాలను కాంటాలు పెట్టారు. (దొడ్డు,సన్న రకం) మిల్లులకు తరలించే విషయంలో కూడా క్రమ పద్ధతిని పాటించకుండా నిర్వాహకులు తమకు ఇష్టం ఉన్నవారి బస్తాలు లోడ్ చేస్తుండగా వారిని నిలదీశాడు. ఎమ్మెల్యేకు చెప్పుకుంటావో ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోపో అని నిర్వాహకులు దురుసుగా మాట్లాడటంతో మనస్తాపానికి గురైన యాకూబ్ కొనుగోలు కేంద్రం వద్ద ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకోగా గమనించిన స్థానికులు అడ్డుకొని నచ్చజెప్పారు. ఆ తర్వాత యాకూబ్ బస్తాలను మిల్లుకు తరలించారు.




## కలెక్టరేట్ ఎదుట మక్కజొన్న రైతుల ధర్నా

విదేశీ విత్తనోత్పత్తి కంపెనీల ద్వారా నష్టపోయిన వెంకటాపురం(నూగూరు), వాజేడు మండలాలకు చెందిన మక్కజొన్న రైతులు సోమవారం ములుగు కలెక్టరేట్ ఎదుట ధర్నాచేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ వన నిర్మాణ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్స నర్సింహమూర్తి మాట్లాడుతూ.. రెండు మండలాల్లో 900 మంది మక్కజొన్న రైతులు ఆయా కంపెనీల విత్తనాల ద్వారా పంట దిగుబడి రాక అప్పుల్లో కూరుకుపోయారని తెలిపారు. ఎకరానికి రూ. లక్షా 50వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. - ములుగురూరల్

## 4 రోజులు వానలు

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ): ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో మరో నాలుగు రోజులు మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది. దీంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్టు వెల్లడించింది. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్టు హెచ్చరించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ తేలిక పాటి వర్షాలు పడతాయని పేర్కొన్నది. కొన్ని జిల్లాల్లో మాత్రం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ కేంద్రం సూచించింది.


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు, బీఆర్‌ఎస్వీ నాయకులు

## కొనుగోలు కేంద్రాల్లో నిలువు దోపిడీ

- రెండున్నర కిలోల తరుగు ఆపివేయాలని డిమాండ్
- నిర్వాహకుల తీరుపై బీఆర్‌ఎస్వీ నాయకుల ఫైర్
- గద్వాల కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి ధర్నా

గద్వాల, మే 12 : ధాన్యం కొనుగోళ్ల పేరిట రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని బీఆర్‌ఎస్వీ నాయకులు ఆరోపించారు. సోమవారం బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో రైతులు జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ నాయకుడు కుర్వ పల్లయ్య మాట్లాడుతూ జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు నిర్వాహకులతో కుమ్మక్కై రైతులను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. క్వింటాకు రెండున్నర కిలోల తరుగు తీస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దోచుకుంటున్నదని మండిపడ్డారు. ఈ విషయాన్ని పలుమార్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని అన్నారు. వెంటనే రైతులకు గన్నీ బ్యాగులు అందజేసి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ సంతోష్‌ను కలిసి అయిజ మండలంలోని రాజాపురం, పులికల్, బైనపల్లి తదితర కేంద్రాల్లో జరుగుతున్న దోపిడీపై వినతిపత్రం అందజేశారు.

# ఎకరాకు రూ. 60 లక్షల పరిహారం ఇవ్వాలి

- కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి
- భూసేకరణపై గ్రామసభల్లో అన్నదాతల డిమాండ్

ఊట్కూర్, మే 12 : భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులుగా వ్యవసాయ భూములు కొనుగోలుచేసి ఇవ్వాలని, లేనిపక్షంలో మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు రూ.60 లక్షలు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల్లో భాగంగా భూ సేకరణ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో నారాయణపేట ఆర్డీవో రామచందర్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని బాపురం, తిప్రాస్‌పల్లి, పులిమామిడి, జీర్ణహళ్లి, పెద్దపొర్ల గ్రామాల్లో రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులు ఓపెన్ కెనాల్, పైపులైన్, సంప్ హౌస్, సబ్‌స్టేషన్ నిర్మాణాల్లో భాగంగా భూములు కోల్పోయే రైతుల వివరాలను చదివి వినిపించారు. తమకు సమాచారం ఇవ్వకుండా సర్వే పనులు పూర్తి చేయడంతో కొలతల్లో తేడాలు ఉన్నాయని, రీ సర్వే నిర్వహించాలని రైతులు పేర్కొన్నారు. సర్వే పూర్తి చేసి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ నష్టపరిహారం చెల్లించలేదని, ఖరీఫ్ సాగుకు పొలాలను సిద్ధం చేయాల్సి ఉండడంతో అధికారులు భూ సేకరణ చేపడితే పెట్టుబడులు నష్టపోతామని తెలిపారు.


ఊట్కూర్ మండలం బాపురం గ్రామసభలో ఆర్డీవోకు సమస్యలను వివరిస్తున్న రైతులు

## పరిహారం చెల్లించాలని రైతుల ధర్నా


భారత్‌మాల రోడ్డులో భూములు కోల్పోయిన తమకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం దేవబండ గ్రామానికి చెందిన రైతులు భారత్‌మాల రోడ్డుపై టెంట్ వేసుకొని ధర్నా చేపట్టారు. పరిహారం కోసం నెలల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. - అయిజ రూరల్

## దుబ్బాకలో చేనేత కార్మికుడి ఆత్మహత్య

- ఉపాధి కరువై ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇంట్లో ఉరివేసుకుని మృతి

దుబ్బాక, మే 12: ఉపాధి కరువై.. ఆర్థిక ఇబ్బందులు తాళలేక చేనేత కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం సిద్దిపేట జిల్లా దుబ్బాకలో చోటుచేసుకున్నది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాకకు చెందిన గౌరిట్యాల బాలరాజు(48) కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్నాడు. ఏడాదిన్నరగా చేనేతకు ఆదరణ లేకపోవడంతో కులవృత్తిని వదిలి కూలికి వెళ్తున్నాడు. వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు సరిపోక ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. అతడి భార్య లత ముగ్గురు పిల్లలతో హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ ఓ కంపెనీలో పనిచేస్తుంది. బాలరాజు దుబ్బాకలో తల్లి సరోజన వద్ద ఉంటున్నాడు. కుటుంబ పోషణ కోసం తెలిసిన వారివద్ద సుమారు రూ.5 లక్షలు అప్పు చేశాడు. కులవృత్తి సాగక, చేసిన అప్పులు తీరే మార్గం లేక ఆందోళనతో బాలరాజు ఇంట్లోని దూలానికి ఉరేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


బాలరాజు (ఫైల్)

## ధాన్యం కొనుగోలులో 50 బస్తాలు గోల్‌మాల్

### న్యాయం చేయాలంటున్న కౌలు రైతు భూమయ్య

పాపన్నపేట,మే 12: కొనుగోలు కేంద్రంలో 50 బస్తాల ధాన్యం గోల్‌మాల్ జరిగినట్టు మెదక్ జిల్లా పాపన్నపేటకు చెందిన కౌలు రైతు బైండ్ల భూమయ్య ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత రైతు వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా పాపన్నపేట పెద్ద ఎస్సీవాడ వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి కౌలురైతులు బైండ్ల భూమయ్య, బట్టి భారతి, ప్రభాకర్, నదరి నారాయణ, చోటు, కుర్మ కిషన్‌కు చెందిన 766 బస్తాలతో లారీ లోడ్‌చేశారు. శనివారం ధాన్యం లారీ లక్ష్మీనగర్ ప్రాంతంలో ఓ రైస్‌మిల్‌కు వెళ్లింది. ఆదివారం బైండ్ల భూమయ్యకు చెందిన 50 బస్తాలు తక్కువగా రావడంతో రూ.47 వేల వరకు నష్టపోయినట్టు వాపోయారు. కమ్యూనిటీ కోఆర్డినేటర్ శివరాణిని వివరణ కోరగా.. చీకటి కావడంతో కమిటీ మెంబర్లు లారీ పూర్తిస్థాయిలో లోడ్ కాకముందే ఇంటికి వెళ్లారన్నారు. ట్రక్ షీట్‌పై కమిటీ మెంబర్ల సంతకం ఉంటుందని, హమాలీల వద్ద కూడా లెక్క ఉంటుందని చెప్పారు. ఈ విషయమై విచారణ జరుపుతున్నట్టు వివరించారు.


ధాన్యం బస్తాపై రాసిన సంఖ్య, బాధిత రైతు భూమయ్య

## ఆర్థిక ఇక్కట్లతో మరో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

సైదాబాద్, మే 12: ఆర్థిక ఇబ్బందులు తాళలేక మరో ఆటోడ్రైవర్ తనువు చాలించాడు. ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకున్నది. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం నేరేడుగొమ్ము గ్రామానికి చెందిన అన్యపాక నాగరాజు (32) సైదాబాద్ చింతల్‌లో నివాసం ఉంటూ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య రాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆ కుటుంబం గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నది. ఇటీవలే అవి మరింతగా పెరిగి భార్యాభర్తల నడుమ వివాదం చోటుచేసుకోవడంతో రాణి పుట్టింటికి వెళ్లింది. ఆర్థిక ఇక్కట్లతో నాగరాజు మనస్తాపం చెందాడు. ఆదివారం రాత్రి తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.


నాగరాజు (ఫైల్)